సాక్షి నిజామాబాద్

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



సీఎం కప్ పోటీలకు ఎంపిక

ఆర్మూర్ పట్టణంలో మంగళవారం సీఎం కప్ పోటీలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు.

- 8లో ▸



పొరపాట్లకు తావివ్వొద్దు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు మొబైల్ యాప్ సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.9 /8.8

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.



హోల్‌సేల్ మార్కెట్‌లోకి బైక్‌పై కూరగాయలను తీసుకుని వస్తున్న రైతు



పూల వ్యాపారులు



కంఠేశ్వర్‌లోని చాయ్ హోటల్ వద్ద టీ కోసం జనం



హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో స్వెటర్లు వేసుకొని మహిళలు

బతుకు చిత్రం.. గజగజ



ఎముకలు కొరికే చలి.. నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 9.1 సెల్సియస్ డిగ్రీలు నమోదవుతున్నాయి. రాత్రి 9 గంటలు అయ్యిందంటే నగరం మునుగేస్తోంది. దుకాణాలు మూతపడుతున్నాయి. రోడ్లు నిర్మానుష్యమవుతున్నాయి. భళ్లున తెల్లవారితే గానీ ప్రజలు బయటకు రావటం లేదు. ఇదిలా ఉంటే మరోవైపు ఇంతటి చలిలో కార్మిక వర్గాలు, చిరువ్యాపారులకు బతుకు పోరాటం తప్పటం లేదు. నడిరేయి దాటిన తర్వాత ఉపాధి కోసం నిత్యవిధుల్లో నిమగ్నమవుతున్నారు. మసక చీకట్లో రోడ్లు ఊడుస్తూ పారిశుధ్య కార్మికులు, కూరగాయలు తరలిస్తున్న చిరు వ్యాపారులు, టీ అమ్ముకుంటూ చాయ్ వాలాలు, రోడ్లపై దుప్పట్లు కప్పుకుని వెళ్తున్న రైసు మిల్లు కార్మికులు కనిపిస్తున్నారు. మంగళవారం తెల్లవారు జాము 3 గంటల నుంచి 'సాక్షి' బృందం నిర్వహించిన విజిట్‌లో ఆవిష్కృతమైన బడుగు జీవుల బతుకు చిత్రం ఇదీ.. – నిజామాబాద్ సిటీ

ఇందూరు నగరంలో వారం రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇళ్ల నుంచి జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చలి కారణంగా మహిళలు, చిన్న పిల్లలు సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్నారు. చలి నుంచి రక్షించుకునేందుకు జనాలు చలిమంటలు వేసుకుంటున్నారు. తప్పనిసరి కుటుంబ పోషణ కోసం కొందరు తెల్లవారుఝమున బయటకు వచ్చి పనులు చేసుకుంటున్నారు. ఉదయం 7 గంటలైనా భానుడు కనపడటం లేదు. నగరంలో జిల్లాలో కని ష్ట ఉష్ణోగ్రతలు 9.1 డిగ్రీల సెల్సియస్ నుంచి 10.3 డిగ్రీల సెల్సియస్ నమోదవుతున్నాయి. మరో వారం రోజుల వరకు ఈ కనిష్ట ఉష్ణోగ్రత్తలు కొనసాగనున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

- నగరంలో గణనీయంగా తగ్గిన కనిష్ట ఉష్ణోగ్రత్తలు
- ఇళ్లకే పరిమితమవుతున్న వృద్ధులు, పిల్లలు
- చలిని లెక్కచేయని కార్మిక వర్గాలు, చిరు వ్యాపారులు
- తెల్లవారుజామునుంచే విధుల్లో పారిశుధ్య కార్మికులు
- ఉదయం 7 గంటలైనా కనిపించని భానుడు



ఖానాపూర్‌లో దుప్పట్లు కప్పుకొని చలిమంటలను కాచుకుంటున్న జనాలు

కోటగిరి..

- రాత్రి పది దాటితే నిర్మానుష్యం



కోటగిరి ప్రభుత్వ హాస్టల్‌లో చలివల్ల గదుల్లో కూర్చొని చదువుకుంటున్న విద్యార్థులు

కోటగిరి (రుద్రూర్): నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలో నాలుగైదు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. జిల్లాలోనే కోటగిరిలో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప రాత్రి పది గంటల తర్వాత జనాలు బయటకు రావడం లేదు. రాత్రి తొమ్మిది గంటలలోపు వ్యాపార సంస్థలు మూసి వేస్తున్నారు. పది దాటిందంటే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వసతి గృహాల్లో రాత్రి భోజనం ముగిసిన వెంటనే విద్యార్థులను గదుల్లోకి పంపించివేస్తున్నారు. గదుల్లోనే హోం వర్క్, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకు నిద్రలేచి మార్నింగ్ వాక్ చేసే వారు నాలుగైదు రోజులుగా చలి తీవ్రతకు భయపడి సూర్య కిరణాలు వచ్చిన తర్వేతే స్వెటర్లు, మంకీ క్యాప్, మఫ్లర్ ధరించి వాకింగ్ చేస్తున్నారు. రైతులు, రైతు కూలీలు మాత్రం తెల్లవారు జామున చలిని లెక్క చేయకుండా పాలు పితికి చాయ్ హోటళ్లకు తీసుకువస్తున్నారు. నాట్లు వేసే సీజన్ కావడంతో ఉదయం ఆరున్నరకు పంట పొలాల్లోకి వెళుతున్నారు. చలి నుంచి ఉప శమనం పొందడానికి మంటలు వేసి కాపుకుంటున్నారు. అయితే చలి వల్ల పాడి పశువుల్లో పాలు, ఫ్యాడి శాతం తగ్గినట్లు రైతులు తెలిపారు. పశువుల పాకలో చలితాకిడి నుంచి పశువులు తట్టుకోవడానికి పట్టాలు కప్పి వెచ్చదనం చేస్తున్నారు.



కోటగిరిలో చలి నుంచి పశువుల రక్షణకు పాక చుట్టూ కట్టిన టార్పాలిన్, దోమ తెరలు



స్వెటర్‌లు ధరించి వ్యవసాయ పనులకు వెళుతున్న కూలీలు

ఇళ్లకే పరిమితం..

కనిష్ట ఉష్ణోగ్రతలతో నగరవాసులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. బయటకురావడం లేదు. అత్యవసర పనుల నిమిత్తం బయటకువచ్చినా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వెచ్చని ఉన్ని దుస్తులు, తలకు మంకి క్యాప్, చేతులకు గ్లౌవ్స్ ధరిస్తున్నారు.



బైపాస్ రోడ్డులో ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

పారిశుధ్య కార్మికులు..

నగరంలో చలిగాలులు వీస్తున్నాయి. విపరీతమైన చలి ఉన్నప్పటికీ కార్మిక వర్గాలు పనుల నిమిత్తం ఇళ్లనుంచి బయటకు రాక తప్పడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 5 గంటలకే విధులకు హాజరవుతున్నారు. నగరంలోని పలు జోన్ కార్యాలయాల్లో అటెండెన్స్ ఇచ్చి హోటల్‌లో వేడి వేడి టీ తాగుతూ చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. అనంతరం రోడ్లను ఊడ్చే పనుల్లో నిమగ్నమవుతున్నారు. కూరగాయలు అమ్మే చిల్లర వ్యాపారులు శ్రద్ధానంద గంజ్‌లోని హోల్‌సేల్ మార్కెట్‌కు ఉదయం 4 గంటలకే వస్తున్నారు. కావలిసిన కూరగాయలను హోల్‌సేల్‌లో కొనుగోలు చేసి వెళ్తున్నారు.

ఫొటోలు : సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్



కలెక్టరేట్ రోడ్డును కప్పేసిన పొగ మంచు, లైట్లు వేసుకొని వస్తున్న వాహనాలు

మండలాల వారీగా నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్)	
నిజామాబాద్ నార్త్ (గోపన్ పల్లి)	9.1
సాలూరా	9.3
నిజామాబాద్ సౌత్	9.3
పోతంగల్	9.3
మోస్రా	9.7
మెండోరా	9.9
మోపాల్ (మంచిప్ప)	9.9
సిరికొండ (చీమన్‌పల్లి)	10
బోధన్ (చిన్నమావంది)	10.1
సిరికొండ(తూంపల్లి)	10.2
నిజామాబాద్ నార్త్	10.3
బాల్కొండ	10.3
ఎడపల్లి (జానకంపేట్)	10.3
డిచ్‌పల్లి	10.4
బోధన్(బెలాల్)	10.4
చందూర్	10.4
నిజామాబాద్ రూరల్ (పాల్దా)	10.6
రుద్రూర్	10.6
మాక్లూర్ (మదన్‌పల్లి)	10.6
రెంజల్	10.6
ఆర్మూర్ (ఇస్సాపల్లి)	10.7
వేల్పూర్	10.7
బోధన్ (కల్దుర్కి)	10.8
ఎడపల్లి	(10.9)
ఆర్మూర్ (పెర్కిట్)	10.9
ముప్కాల్	10.9
ఆర్మూర్ (మగ్గిడి)	11
సిరికొండ	11.1
మోర్తాడ్	11.1
భీంగల్	11.3
కమ్మర్‌పల్లి (కోనసముందర్)	11.3
ఎర్గట్ల	11.4
నవీపేట్	11.5
నిజామాబాద్ రూరల్ (మల్కాపూర్)	11.5
నందిపేట్ (సీహెచ్ కొండూర్)	11.7
ఇందల్వాయి (గన్నారం)	11.8
మాక్లూర్ (లక్మాపూర్)	11.8
కమ్మర్‌పల్లి	11.8
వర్ని (జాకోరా)	12.5
డిచ్‌పల్లి (కొరడ్‌పల్లి)	12.7
ఆలూర్	13
జక్రాన్‌పల్లి	13.1
డొంకేశ్వర్ (తొండకూర్)	13.9
ధర్పల్లి	14.2



గంగిరెద్దును తీసుకొని వస్తున్న బస్వన్న



బస్టాండ్‌లో రెండే బస్సులు

చలిలోనే పనులు చేయాలి

కంఠేశ్వర్ జోన్‌లో పారిశుధ్య పనులు చేస్తాను. ఉదయం 5 గంటలకే అటెండెన్స్ ఇచ్చి పనిలోకి వెళ్తాను. వణికించే చలిలోకూడా రోడ్లు శు భ్రం చేస్తున్నాం. రోడ్లు ఊడ్చాలి అంటే చేతులు వణుకుతున్నాయ్. చేతులకు గ్లౌవ్స్, వెచ్చని జాకెట్లు కూడా బల్దియా అధికారులు ఇవ్వడం లేదు.

– లల్లాభాయి, పారిశుధ్య కార్మికురాలు

హోల్‌సేల్ మార్కెట్‌లో కొని తీసుకెళ్తా

వణికే చలిలో తెల్లవారక ముందే గ్రామం నుంచి బయలుదేరి నగరానికి వస్తాను. శ్రద్ధానంద్‌గంజ్‌లో కూరగాయలు హోల్‌సెల్‌లో కొని మా ఊరికి తీసుకెళ్లి విక్రయిస్తాను. ప్రతిరోజు మార్కెట్‌కువచ్చి కూరగాయలు తీసుకెళ్తాను. చలిని పట్టించుకుంటే బతుకు కష్టమవుతుంది.

– అశోక్, కూరగాయల వ్యాపారి, తిర్మన్‌పల్లి

చలిలోనే పనులు షురూ జేస్తం

మేం బీహార్ నుంచి వచ్చాం. ఖానాపూర్‌లోని రైసుమిల్లులో పనులు చేస్తాం. తెల్లవారు జామున 4 గంటలకు లేచి రొట్టెలు చేసుకుని 5 గంటల కల్లా పనిలోకి వస్తాం. చలి నుంచి రక్షణగా మఫ్లర్‌లు, రగ్గులు కప్పుకుంటున్నాం.

– పటేల్, కూలీ, బీహార్‌వాసి

ఉదయం 4 గంటల నుంచే చాయ్

పొద్దు పొద్దున 4 గంటల నుంచే టీ చేస్తాం. మున్సిపల్‌లో పనిచేసే కార్మికులు అంతా మా హోటల్ లోనే టీ తాగుతారు. వారి కోసమే పొద్దునే టీ చేస్తాం. విపరీతమైన చలివున్నా, వర్షం పడ్డా దుకాణం మాత్రం తెల్లవారుఝామునే తీస్తాం.

– ప్రేమ్, టీ దుకాణం, కంఠేశ్వర్ బస్టాండ్

వారం రోజులు కొనసాగుతుంది

ఉత్తర భారతదేశం నుంచి చలిగాలులు వీస్తున్నాయి. రాజస్థాన్, విదర్భ మీదుగా వీచే చలిగాలుల వల్ల ఉత్తర తెలంగాణలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. వారం రోజుల వరకు కొనసాగుతాయి. రెండు రోజులుగా కనిష్టం 11.9 డిగ్రీల సెల్సియస్ నుంచి 12 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. గరిష్టంగా 18 డిగ్రీల సెల్సియస్ నుంచి 22 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. జిల్లా కోల్డు వేవ్ కండిషన్‌లో ఉంది. – ప్రతాప్, వాతావరణశాఖ అధికారి

న్యూస్‌రీల్

ఎంపీ అర్వింద్ లేఖకు స్పందించిన విదేశాంగశాఖ



సుభాష్‌నగర్: దుబాయ్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలు, క్షతగాత్రులను ఆదుకోవాలని, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన బాధితులు ఉన్నారని కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్‌కు ఎంపీ అర్వింద్ మంగళవారం రాసిన లేఖకు విదేశాంగ శాఖ కార్యాలయం స్పందించింది. విదేశాంగ కార్యాలయ కాన్సులేట్ అధికారులు ఘటనాస్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను, భారతదేశ పౌరులను ఆస్పత్రిలో కలిసి వివరాలను తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారని పేర్కొంది. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించింది.

పోలీసుల నిర్లక్ష్యంతోనే ఠాణాలో ఆత్మహత్య !

- నైట్ ప్యాంట్ నాడాతో ఉరివేసుకున్న నిందితుడు
- కొనసాగుతున్న జుడీషియల్ విచారణ



రత్నావత్ రెడ్యా(ఫైల్)

రెంజల్ (బోధన్)/ఖలీల్‌వాడి: మతిస్థిమితం లేని ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన నిందితుడు పోలీసుల నిర్లక్ష్యం వల్లే స్టేషన్‌లో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విశ్వయనీయ వర్గాలు అందించిన సమాచారం మేరకు ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని ఓ గ్రామంలో మతిస్థిమితంలేని బాలిక పై అత్యాచారం చేశాడని నిందితుడు రత్నావత్ రెడ్యాపై బాలిక బంధువులు దాడి చేసి చితక బాదారు. స్థానికులు డయల్ 100 కు కాల్ చేయగా రెంజల్ పోలీసులు గ్రామానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన రెడ్యాను ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తలకు నాలుగు కుట్లు వేసి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం పోలీసులు అర్ధరాత్రి రెండున్నర గంటలకు రెడ్యాను తిరిగి రెంజల్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఇంటరాగేషన్ అనంతరం ఎస్సై, సీఐలు అతన్ని లాకప్ పక్క గదిలో పెట్టి నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లకు బాధ్యతలు అప్పగించి వెళ్లారు. అయితే నైట్ డ్యూటీలో ఉన్న పోలీసులు నిద్రకు ఉపక్రమించడంతో రెడ్యా నైట్ ప్యాంటు నాడాతో స్టేషన్‌లోని కిటికీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున నాలుగు గంటలకు గుర్తించిన పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి రెడ్యా మృతదేహాన్ని తిరిగి ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది. అప్రమత్తమైన పోలీసు ఉన్నతాధికారులు మరోవైపు అల్లర్లు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీ బలగాలతో గ్రామానికి చేరుకున్నారు. రెడ్యాపై దాడిచేసిన 11 మందిని నిద్ర నుంచి మేల్కొలిపి అదుపులోకి తీసుకుని గ్రామం నుంచి తరలించారు. వివిధ పోలీసు స్టేషన్‌లలో ఉంచిన వీరిని అదుపులోకి తీసుకుని ఐదు రోజులు గడుస్తున్నా కోర్టులో హాజ రు పర్చలేదు. రెడ్యా మృతదేహాన్ని రెండో రోజు సాయంత్రం ఆరు గంటలకు కుటుంబ సభ్యులకు అందించారు. రెడ్యా మృతిపై విచారణ చేపట్టిన మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి మూడు రోజులుగా బోధన్‌లో ఉండి విచారణ చేస్తున్నట్లు సమాచారం. జిల్లా న్యాయమూర్తి పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్య ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించడంతో మేజిస్ట్రీరియల్ విచారణ కూడా జరుగుతోంది. ఇప్పటికే పోస్ట్ మార్టంకు సంబంధించిన అంశాలు, ఘటన వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. పోస్టుమార్టరం నివేదిక ప్రకారం చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. పోలీసులు డాక్టర్లతో మాట్లాడి ఇష్యూ బయటకు రాకుండా చేయడానికి ప్రయత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెంజల్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడు ఉరి వేసుకున్న ఘటనపై సీఐ, ఎస్సై, సిబ్బందిని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ మందిలించినట్లు సమాచారం. ప్రొఫెసర్ డాక్టర్ నాగమోహన్ ను పోస్టుమార్టరం కోసం వివరణ కోరగా జ్యుడీషియల్ విచారణ కొనసాగుతోందని, దీనిపై ఇప్పుడు ఏమీ మాట్లాడలేమని స్పష్టం చేశారు.

'అర్బన్'కు రూ.100 కోట్లు ఇవ్వండి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: ఇందూరు అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.వంద కోట్లు విడుదల చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మంగళవారం మాట్లాడారు. స్పెషల్ ఫండ్ కింద నియోజకవర్గానికి రూ.10 కోట్లు ప్రకటిస్తే.. స్థానిక ఎమ్మెల్యే ప్రమేయం లేకపోతే ఆ నిధులు పక్కదారి పట్టే ఆస్కారం ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు రూ.4వేల కోట్లు, కొందరి మంత్రుల నియోజకవర్గాలకు రూ.వందల కోట్లు మళ్లిస్తున్నారని, బీజేపీ ఎమ్మెల్యేల నియోజకవర్గాలపై పక్షపాత వైఖరి చూపిస్తున్నారని ఆరోపించారు.

బిల్లులు చెల్లించడం లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. తన నియోజకవర్గంలో 143 పనులకు సంబంధించిన రూ.6 కోట్లు, 33 ఆలయాలకు రూ.3కోట్ల బిల్లులు చెల్లించలేదన్నారు. రాష్ట్రానికి ఆదాయం వస్తున్నా, సంవత్సర కాలంలో రూ.1.27 లక్షల కోట్లు అప్పుతెచ్చారన్నారు.

క్లుప్తంగా

వాడి వాసికి డాక్టరేట్‌



వేల్పూర్‌: మండలంలోని వాడి గ్రామానికి చెందిన సుంకరి గంగాధర్‌ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సిద్ధాంత గ్రంథానికి ఇటీవల డాక్టరేట్‌ పొందినట్లు కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కంకణాల రాజేశ్వర్‌ మంగళవారం తెలిపారు. జిల్లాలోని సారంగపూర్‌ హైస్కూలులో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగాధర్‌ ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ స్మృతి కవిత్వం సమగ్ర పరిశీలన అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఓయూ తెలుగుశాఖ అధ్యక్షుడు సాగి కమలాకర్‌శర్మ, ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ చింతకింది కాసీం, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్‌, డాక్టర్‌ రఘు, ప్రొఫెసర్‌ వారిజారాణి, డాక్టర్‌ సల్ల సత్యనారాయణ, డాక్టర్‌ భాగ్యలక్ష్మి, డి.గోపాల్‌ గంగాధర్‌ను అభినందించారు.

మరోసారి రిజిస్ట్రార్‌గా యాదగిరి



తెయూ(డిచ్‌పల్లి): తెయూ రిజిస్ట్రార్‌గా ఎం యాదగిరి కొనసాగనున్నారు. ఈ మేరకు వీసీ యాదగిరిరావు ఉత్తర్వులు జారీ చేశారు. గత వీసీ రవీందర్‌ గుప్తా 2023జూన్‌16న ఆరు నెలల కాలానికి రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం వీసీ రవీందర్‌ గుప్తా ఏసీబీ కేసులో అరెస్ట్‌ కావడంతో ప్రభుత్వం ఆయనను సస్పెండ్‌ చేసింది. తర్వాత తెయూ ఇన్‌చార్జి వీసీగా ఉన్న వాకాటి కరుణ 2023 డిసెంబర్‌16 నుంచి 2024 డిసెంబర్‌ 15 వరకు ఏడాది కాలానికి రిజిస్ట్రార్‌గా యాదగిరి పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నెల 15న యాదగిరి పదవీ కాలం ముగిసింది. ప్రస్తుత వీసీ యాదగిరి రావు ఈ నెల 16 నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు రిజిస్ట్రార్‌గా యాదగిరి కొనసాగుతారని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో యాదగిరి మరికొంత కాలం రిజిస్ట్రార్‌గా కొనసాగనున్నారు.

పోలింగ్‌ స్టేషన్ల జాబితా విడుదల

సుభాష్‌నగర్‌: జిల్లాలోని 27 మండలాల్లో పోలింగ్‌ కేంద్రాల ఫైనల్‌ పబ్లికేషన్‌ను ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌ మంగళవారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాలు, 545 జీపీలు, 5022 వార్డు స్థానాలు, 5053 పోలింగ్‌ స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్‌ స్టేషన్లపై ఇది వరకే మండల, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన విషయం తెలిసిందే. ప్రభుత్వం జీపీ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో కీలకమైన పోలింగ్‌ కేంద్రాల ఫైనల్‌ పబ్లికేషన్‌ పకడ్బందీగా పూర్తి చేశారు.

సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు



సులేమాన్‌నగర్‌లో అధికారులకు సర్వే మార్గదర్శకాలు వివరిస్తున్న కలెక్టర్‌

బోధన్‌/ రుద్రూర్‌: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చేపడుతున్న మొబైల్‌ యాప్‌ సర్వేను పక్కాగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు అధికారులు, సిబ్బందికి సూచించారు. బోధన్‌ పట్టణ కేంద్రంతో పాటు రుద్రూర్‌ మండలంలోని సులేమాన్‌నగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల మొబైల్‌ యాప్‌ సర్వే ప్రక్రియను కలెక్టర్‌ మంగళవారం పరిశీలించారు. రోజుకు ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారో సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకునేలా కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల ఇంటింటికి వెళ్లి సర్వేయర్లు చేపట్టిన సర్వే, వివరాల సేకరణ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారు వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే వారి వివరాలను కూడా సర్వే యాప్‌లో నమోదు చేయాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఏవైనా సందేహాలుంటే మున్సిపల్‌ పరిధిలోని వారు ఆ వార్డు అధికారి, గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలన్నారు. సులేమాన్‌నగర్‌లో మనఊరు – మనబడి, జీపీ పనులకు సంబంధించి రూ. 22లక్షలు పెండింగ్‌ బకాయిలున్నట్లు మాజీ సర్పంచ్‌ ఖాదర్‌ కలెక్టర్‌ దృష్టికి తెచ్చారు. పెండింగ్‌ బిల్లులు ఇప్పించాలని కోరారు. కలెక్టర్‌ వెంట సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో, మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట నారాయణ, బోధన్‌, రుద్రూర్‌ తహసీల్దార్లు విఠల్‌, తారాబాయి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఖాళీ సీట్ల భర్తీ



కౌన్సెలింగ్‌ నిర్వహిస్తున్న అడ్మిషన్స్‌ డైరెక్టర్‌

తెయూ(డిచ్‌పల్లి): తెయూ న్యాయ కళాశాల(లా కాలేజ్‌)లో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం స్పాట్‌ కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఎల్‌ఎల్‌బీ కోర్సులో ఖాళీగా ఉన్న 14 సీట్లకు 12 సీట్లను, ఎల్‌ఎల్‌ఎంలో ఖాళీగా ఉన్న ఒక సీటును 2024 లా స్టేట్‌ ఎంట్రెన్స్‌ ర్యాంకు మెరిట్‌ ఆధారంగా రోస్టర్‌ను పాటిస్తూ భర్తీ చేసినట్లు అడ్మిషన్స్‌ డైరెక్టర్‌ కె సంపత్‌కుమార్‌ పేర్కొన్నారు. లా కాలేజ్‌ సెమినార్‌ హాల్‌లో నిర్వహించిన ఈ స్పాట్‌ కౌన్సెలింగ్‌లో 29 మంది విద్యార్థులు పాల్గొనగా ఎంపికైన వారి వివరాలను వెంటనే ప్రకటించినట్లు డైరెక్టర్‌ తెలిపారు. స్పాట్‌ కౌన్సెలింగ్‌ ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్‌, హాస్టల్‌ వసతి ఇవ్వబడదని తెలిపారు. కార్యక్రమంలో లా కాలేజ్‌ అధ్యాపకులు ప్రసన్న రాణి, స్రవంతి, జూనియర్‌ అసిస్టెంట్లు సురేష్‌రెడ్డి, రవీందర్‌నాయక్‌ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న సీఎం కప్‌ పోటీలు



హ్యాండ్‌బాల్‌ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



చెస్‌లో ఎంపికైన క్రీడాకారులు

నిజామాబాద్‌ నాగారం: జిల్లా స్థాయి సీఎం కప్‌ టోర్నమెంట్‌ ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం వాలీబాల్‌, చెస్‌, ఫుట్‌బాల్‌, బాస్కెట్‌ బాల్‌, స్విమ్మింగ్‌, హ్యాండ్‌బాల్‌, పలు రకాల పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు ఈనెల 27 నుంచి జనవరి 2 వరకు నిర్వహించే పోటీలకు పంపించనున్నారు. పోటీలు జిల్లా యువజన క్రీడల కార్యదర్శి ముత్తెన్న ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

పోటీల్లో వాలీబాల్‌ జూనియర్‌ విభాగంలో డిచ్‌పల్లి బాల, బాలికల జట్లు విజేతగా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌ సీనియర్‌ విభాగంలో పురుషులు మొదటి విజేత, వేల్పూర్‌ మండలం ద్వితీయ విజేతగా నిలిచాయి. ఫుట్‌బాల్‌ సీనియర్‌ విభాగంలో పురుషులు మొదటి విజేత నిజామాబాద్‌అర్బన్‌, ద్వితీయ విజేత-నిజామాబాద్‌రూరల్‌, ఫుట్‌బాల్‌ సీనియర్‌ విభాగంలో మొదటి విజేత నిజామాబాద్‌అర్బన్‌, ద్వితీయ విజేత ఆర్మూర్‌ మండలం నిలిచింది. చెస్‌ సబ్‌ జూనియర్‌ విభాగంలో బాలుర మొదటి విజేత బి.అభిజిత్‌, ద్వితీయ విజేత జె.రవివర్మ, చెస్‌ సబ్‌ జూనియర్‌ విభాగంలో మొదటి విజేత రిశిత సర్దేశ్‌ పాండే – వై.ఖ్యాతి శివంత విజేతలుగా నిలిచారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్‌ పోటీలకు లక్షిత్‌



నిజామాబాద్‌ నాగారం: రాష్ట్రస్థాయి క్రికెట్‌ అసోసియేషన్‌ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్‌–14 క్రికెట్‌ లీగ్‌ పోటీలకు జిల్లాకు చెందిన కట్కం లక్షిత్‌ ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి క్రికెట్‌ లీగ్‌ పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మొదటి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో 20 పరుగులు బౌలింగ్‌లో ఒక వికెట్‌ తీసి రాణించాడు. లక్షిత్‌ ఎంపికపై మాజీ బీఆర్‌ ఎలెవన్‌ జట్టు కెప్టెన్‌ సోమ శ్రీనివాస్‌, శ్యామ్‌, అజ్మత్‌, ప్రవీణ్‌ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎంను కలిసిన ఒలింపిక్‌ సంఘం సభ్యులు



నిజామాబాద్‌ నాగారం: సీఎం రేవంత్‌రెడ్డిని నూతనంగా ఎన్నికైన తెలంగాణ ఒలింపిక్‌ సంఘం కార్యవర్గ సభ్యులు మంగళవారం జూబ్లీ హిల్స్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంను కలిసిన వారిలో జిల్లా ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి, సభ్యులు అంద్యాల లింగన్న, జితేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, వేణు గోపాలచారి, కోశాధికారి, సభ్యులు పాల్గొన్నారు.



చలి మంటలు

మోర్తాడ్‌: జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులతో ఉష్ణోగ్రతలు కనిష్టానికి పడిపోతున్నాయి. ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చలి నుంచి రక్షణ పొందేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఉదయం, సాయంత్ర వేళల్లో చలి మంటలు కాలుస్తున్నారు. మోర్తాడ్‌లో చిన్నారులు చలి మంటలు కాలుస్తుండగా 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

సీఎం కప్‌ క్రీడా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



పోటీలకు ఎంపికైన బేస్‌బాల్‌, సాఫ్ట్‌బాల్‌ జిల్లా జట్లు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో మంగళవారం సీఎం కప్‌ పోటీలకు సాఫ్ట్‌బాల్‌, బేస్‌బాల్‌ జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్‌, బేస్‌ బాల్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్‌ పేర్కొన్నారు. హైదరబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 18 నుంచి నిర్వహించే బేస్‌ బాల్‌ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు, మెదక్‌ జిల్లాలో ఈ నెల 28 నుంచి నిర్వహించే సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ సంయుక్త కార్యదర్శి ఎం సుజాత, చిప్ప నవీన్‌, నరేశ్‌, మౌనిక, సంజీవ్‌, అనికేత్‌, రమేశ్‌ పాల్గొన్నారు.

న్యూఅంబేడ్కర్‌ భవన్‌లో పెన్షనర్స్‌డే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌



సీనియర్‌ పెన్షనర్‌ను సన్మానిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌

నిజామాబాద్‌ నాగారం: ఉద్యోగ విరమణ సంతోష జీవితానికి ఒక అవకాశమని అడిషనల్‌ కలెక్టర్‌ అంకిత్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్‌ భవన్‌లో మంగళవారం నిర్వహించిన జాతీయ పెన్షనర్స్‌ డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఉద్యోగి ప్రభుత్వ సేవ, ప్రజల కోసం అంకితం చేసినందుకు ఉద్యోగ విరమణ అనంతరం వారి జీవితం సవ్యంగా సాగిపోయేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రధాన వక్తగా హాజరైన పెన్షనర్ల సంఘం జాతీయ నాయకురాలు సంయుక్త మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ఫలితంగా ఈ పెన్షన్‌ హక్కును మన పూర్వీకులు సాధించి పెట్టారని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతరెడ్డి రాజారెడ్డి మాట్లడుతూ.. పెన్షనర్స్‌ తన అనుభవంతో సమాజానికి ఎంతో సేవలందిస్తున్నారని అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ వయోవృద్ధుల జిల్లా అధికారిణి రసూల్‌ బీ మాట్లాడుతూ.. పిల్లలపై ప్రేమతో తల్లిదండ్రులు తమ ఆస్తి పాస్తులను వారసులకు అప్పగిస్తున్నారని, కానీ పెద్దవారి బాగోగులు చూడటానికి అనేకమంది నిరాకరిస్తున్నారని ఇది సమాజంలో కొనసాగటం దురదృష్టకరమని అన్నారు. అనంతరం పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో ట్రెజరరీ డిప్యూటీ డైరెక్టర్‌ కె దశరథ్‌, కె రామ్మోహన్‌రావు, మధుసూదన్‌, ఈవీఎల్‌ నారాయణ, హమీదుద్దీన్‌, హనుమ న్లు, ప్రసాద్‌ రావు, కృష్ణారావు, బాబా గౌడ్‌, లావు వీరయ్య, లక్ష్మీనారాయణ, భోజారావు, సిర్ప లింగయ్య, శ్రీనివాస్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఆదర్శ రైతు వ్యవస్థ

- సాగునీటి సంఘాలు కూడా..
- రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌



నిజామాబాద్‌ సిటీ: రైతులకు ఉపయోగపడే నీటి సంఘాలు, ఆదర్శ రైతు వంటి వ్యవస్థలను పునరుద్ధరిస్తామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని దుబ్బలోగల ఆయన నివాసంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గంగాధర్‌ మాట్లాడుతూ.. రైతును రాజును చేయాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ నియమించారన్నారు. రైతుకు ఎలాంటి కష్టం కలగకుండా అన్ని విధాలా అండదండగా నిలవడమే రాష్ట్ర వ్యవసాయ కమిషన్‌ ఉద్దేశ్యమన్నారు. ఈ కమిషన్‌ పరిధి చాలా విస్తృతమైనదన్నారు. మార్కెట్‌యార్డు, గోదాంలు, విత్తనాలు, ఎరువులు, హార్టికల్చర్‌, కోల్డు స్టోరేజీలు వంటి పలు వ్యవసాయ సంబంధ విభాగాలు తమ పరిధిలోకి వస్తాయన్నారు. జిల్లాలో ఎక్కడైనా చెరువులు, కుంటలు అన్యాక్రామంతమైన వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందన్నారు. వ్యవసాయ సొసైటీల్లో రైతుల వివరాలు నమోదులో జాప్యంచేసినవారిపై చర్యలు తీసుకుంటామన్నారురు. త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు తెలుసుకుంటామని తెలిపారు.

క్రైం కార్నర్‌

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

బాల్కొండ: అనారోగ్య సమస్యలతో అప్పుల పాలైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ముప్కాల్‌ మండలం రెంజర్లలో చోటు చేసుకుంది. ముప్కాల్‌ ఏఎస్సై గంగారాం మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. రెంజర్ల గ్రామానికి చెందిన రహీం(50) కాలికి తగిలిన గాయాలతో అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స కోసం ఖర్చు చేశాడు. గ్రామంలో చికెన్‌ సెంటర్‌ నిర్వహించి నష్టపోయాడు. దీంతో అప్పులు పెరగడంతో మనస్తాపానికి గురైన రహీం తన ఇంటి సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్‌ పట్టివేత

రుద్రూర్‌: కోటగిరి పీఎస్‌ పరిధిలోని పోతంగల్‌ మండలం కొల్లూర్‌ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్‌ తండా చౌరస్తాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అనిల్‌ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తండా చౌరస్తాలోని కో ఆపరేటివ్‌ బ్యాంక్‌ సమీపంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 55 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతదేహం పక్కన మద్యం బాటిళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు వివరాలు అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నవీపేట: మండలంలోని యంచ గ్రామానికి చెందిన రొద్ద పోసాని(63) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. ఈనెల 13న తన రేకుల ఇంట్లో చలి తీవ్రతను తట్టుకోలేక మంట కాచుకుంటుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరి కుమారుడు శ్రీకాంత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోస్ట్‌మన్‌ నిధుల దుర్వినియోగంపై కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్‌ పరిధిలో ఉన్న పోస్టాఫీస్‌ నిధులను దుర్వినియోగం చేసిన పోస్ట్‌ మన్‌ పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పోస్టాఫీసులో పనిచేసే పోస్టు మాస్టర్‌ ఐపీబీఎం అకౌంట్‌ ద్వారా రూ. 11,55,000 నగదును దుర్వినియోగం చేసినట్లు తెలిపారు. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అనారోగ్యంతో మాజీ పట్వారి మృతి

రాజంపేట: అనారోగ్యంతో రాజంపేట మాజీ పట్వారి సత్యం పటేల్‌ మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను సోమవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పలువురు రాజకీయ నాయకులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు ఆయన భౌతికాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ



రియాజ్‌ ఇంట్లో చిందర వందరగా చేసిన వస్తువులు

లింగంపేట: మండల కేంద్రంలోని కొత్వాల్‌గల్లీలో మంగళవారం తెల్లవారుజామున తాళం వేసిన రెండు ఇళ్లలో దుండగులు చోరీ చేసినట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రియాజ్‌ నివాస గృహంలో బీరువాలో దాచిన వెండి వస్తువులు, నగదు, పట్టు చీరలు, అపహరించినట్లు తెలిపారు. అలాగే జావిద్‌ నివాస గృహంలో బీరువాను ధ్వంసం చేసి బంగారు గొలుసు, కమ్మలు, రూ. 14 వేలు నగదు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం మండలంలోని పర్మళ్లలో సైతం చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన గంట బాలమణి ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. అర తులం బంగారం, వెండి ఉంగరాలు, పట్టగొలుసులు అపహరణకు గురైనట్లు తెలిపారు. చోరీ జరిగిన విషయాన్ని బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌ చేసి చోరీకి పాల్పడినట్లు స్థానికులు వెల్లడించారు.

దేవునిపల్లిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని దేవునిపల్లిలో బాలరాజు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్‌ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దేవునిపల్లి గ్రామానికి చెందిన బాలరాజు బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లగా అతడి ఇంటికి తాళం వేసి ఉండడంతో దొంగలు సోమవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న 80 తులాల వెండిని చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి ఒక రోజు జైలు శిక్షను సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్‌జాన్‌ విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ మంగళవారం పేర్కొన్నారు. డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులకు కౌన్సిలింగ్‌ నిర్వహించి జడ్జి ఎదుట హాజరు పర్చినట్లు తెలిపారు. ఇందులో 9మందికి రూ.13,500 జరిమానా విధించగా, గౌతంనగర్‌కు చెందిన ఎండీ అనీఫ్‌కు జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

నాలుగో టౌన్‌ పరిధిలో..

నగరంలోని నాలుగో టౌన్‌ పీఎస్‌ పరిధిలో నిర్వహించిన డ్రంకన్‌ డ్రైవ్‌ తనిఖీల్లో ఇద్దరికి జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. గాయత్రీనగర్‌కు చెందిన అంగూర్‌ రాకేశ్‌కు రెండు రోజులు, జెండాగల్లీకి చెందిన ఉప్పరి గోపాల్‌కు ఒక రోజు జైలును జడ్జి విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అర్ధరాత్రి హోటళ్లు, బేకరీలు తెరిచిన వ్యక్తులకు..

ఖలీల్‌వాడి: అర్ధరాత్రి వరకు హోటళ్లు, బేకరీలు తెరిచి ఉంచిన వ్యక్తులకు సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ జైలు శిక్షను విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అర్ధరాత్రి వరకు షాపులు తెరిచి ఉంచిన ఒలంపియా బేకరీ నిర్వాహకుడు షేక్‌ అమాన్‌కు రెండు రోజులు, కొజ్జా కాలనీలో స్టార్‌ హోటల్‌ నిర్వాహకుడు షేక్‌ అస్లాం, తిలక్‌గార్డెన్‌ వద్ద ఉన్న న్యూ ప్యారడైజ్‌ హోటల్‌ నిర్వాహకులు అత్నూర్‌ మియా, అస్లాంకు ఒకరోజు చొప్పున జైలు శిక్షను జడ్జి విధించారు. జిల్లా కేంద్రంలో ఎవరైనా ప్రభుత్వం విధించిన సమయంలోపు దుకాణాలు తెరిచి ఉంచితే తగు చర్యలు తప్పవని ఎస్‌హెచ్‌వో హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్‌

లింగంపేట: గంజాయి సాగు చేస్తూ విక్రయిస్తున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. మంగళవారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని రాంపల్లి కొన తండాకు చెందిన దేవసోత్‌ శంకర్‌ ఇంటి వద్ద గంజాయి సాగు చేస్తూ విక్రయించేవాడు. శంకర్‌ సాగు చేసిన గంజాయి మండలంలోని బాయంపల్లి గ్రామానికి చెందిన అంబెవు సతీశ్‌, కొర్పోల్‌ గ్రామానికి చెందిన పొట్ట్యాల ఆస్టిన్‌కు ఇవ్వగా వారు విక్రయించేవారని తెలిపారు. సతీశ్‌, ఆస్టిన్‌ల స్నేహితులు కామారెడ్డికి చెందిన పిడుతల శ్రీకాంత్‌, అడ్లూర్‌ ఎల్లారెడ్డికి చెందిన ఇంద్రసేనారెడ్డి, కామారెడ్డి పట్టణానికి చెందిన బట్టు సాయికృష్ణకు విక్రయించే వారని పేర్కొన్నారు. వీరు రాంపల్లి కొన తండాకు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు సమాచారం అందడంతో సోమవారం సాయంత్రం రాంపల్లి కొనతండాలో పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 6 సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, 1315 గ్రాముల ఎండు గంజాయి, ఒక గంజాయి మొక్క స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన రైతులు



జక్రాన్‌పల్లి: ఢిల్లీలో కేంద్రమంత్రి శోభా కరంద్లాజేను పసుపు రైతులు మంగళవారం కలిశారు. జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘం ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ ఆధ్వర్యంలో జేఎం కేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు కేంద్ర మంత్రికి ఆహ్వానపత్రికను అందజేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో సంఘం డైరెక్టర్లు పాట్కూరి తిరుపతిరెడ్డి, రాజు, గడ్డం శ్రీనివాస్‌, పుప్పాల నాగేష్‌, గడ్డం లక్‌ పతి, తదితరులు ఉన్నారు.

'యువత సినిమాలతో, పెడదోవ పట్టొద్దు'

కామారెడ్డి అర్బన్‌: ప్రస్తుతం ఎలాంటి సందేశం లేకుండా వస్తున్న సినిమాలతో యువత పెడదోవపట్టడం, చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకోవడం జరుగుతోందని, నేటి సినిమాల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఇంపాక్ట్‌ ట్రైనర్‌, మోటివేషనల్‌ స్పీకర్‌ రమేష్‌ చైతన్య అన్నారు. పట్టణ పరిధిలోని దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం 'జీవితంలో లక్ష్యాలు–సవాళ్లు' అనే అంశంపై రమేష్‌ చైతన్య మాట్లాడారు. జీవితంలో లక్ష్యాలను చేరుకునే క్రమంలో తొలుత సెల్‌ఫోన్లు, మత్తు పదార్థాలను దాటుకుని రావాలన్నారు. హెడ్‌మాస్టర్‌ గంగాకిషన్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్‌ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 19న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బిపి మధుసూదన్‌ రావు మంగళవారం తెలిపారు. మేళాకు వరుణ్‌ మోటార్స్‌ గ్రూప్‌, కీర్తన ఫైనాన్స్‌ సర్వీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ కంపెనీల వారు ఉద్యోగాల కోసం నియామకాలు చేపట్టనున్నారు. సెక్యూరిటీ గార్డ్‌, క్యాషియర్‌, డ్రైవర్‌, ఎగ్జిక్యూటివ్‌, టెక్నిషన్‌, సేల్స్‌ మేనేజర్‌, లోన్‌ ఆఫీసర్‌ ఈ పోస్టులకు ఇంటర్‌, ఏదైనా డిగ్రీ ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9948748428, 6305743423, 77022 59070 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్‌కార్డు, మెమో, ఫోటో తీసుకు రావాలన్నారు.